క్లుప్తంగా

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు సన్మానం

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణాకర్‌ను ఘనంగా సన్మానించారు. కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయ, సింగిల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, స్థానిక నాయకులు ప్రసాద్, నారాయణ, ప్రసాద్, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిర (అగళి): అగళి మండలంలోని పీ బ్యాడిగెరలో గురువారం ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుకొండ: పట్టణంలో బుధవారం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

ఉచిత ఖత్నాకు నమోదు చేసుకోండి

పెనుకొండ: పట్టణంలో ఖాజా గరీబున్నావాజ్ నేతృత్వంలో 17న జరిగే ఉచిత ఖత్నాకు అర్హులైన వారు వారి తల్లిదండ్రుల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ట్రస్ట్ పెద్దలు జాబిలి చాంద్‌బాషా, జహీరుద్దీన్ తదితరులు తెలిపారు. 16 లోపు పిల్లల పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 9492965422 ను సంప్రదించాలని కోరారు.

వైభవంగా మారెమ్మ ఊరేగింపు



మారెమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని గుర్రపుకొండ గ్రామంలోని మడకలకుంట మారెమ్మ దేవత, గ్రామ దేవత ఉత్సవాల్లో భాగంగా బుధవారం మారెమ్మ దేవతను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరులో సమృద్ధిగా పడిన నీళ్లు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని వీవర్స్ కాలనీలో గ్రామ సర్పంచ్ ఆదినారాయణ తాగునీటి సమస్య పరిష్కారం కోసం బుధవారం ఉదయం నూతన బోరును ఏర్పాటు చేయించారు. కొంత కాలంగా నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బోరు వేయించడంతో సమృద్ధికి నీళ్లు పడ్డాయి. దీంతో సర్పంచ్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు



స్వామి సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

హిందూపురం టౌన్: లేపాక్షి మండలం కల్లూరు గ్రామ సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్ మహమ్మద్ యూసుపుల్లా షా కమాల్ పోషా ఖాద్రీ స్వామి ఉరుసు ఉత్సవాలు బుధవారం రాత్రి ముగిసాయి. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో అశ్వర్థనారాయణ స్వామి, ఉమర్ అలిసా, సూఫీ ఝుక్ ఆహ్మద్ జానీ, ఫరీదుల్లా షా, షాబుద్దీన్ షా ఖాద్రి, మహబూబ్ దౌలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

భక్తిశద్ధలతో దుర్గమ్మ జాతర

గోరంట్ల: మండల పరిధిలోని దిగువ గంగంపల్లి తండా వాసులు బుధవారం దుర్గమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళా భక్తులకు అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. ఎమ్మెల్యే శంకరనారాయణ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

అక్వేరియం.. ఆహ్లాదం.. ఆనందం

ఇంటిని బాగా నిర్మించుకోవడమే కాదు .. అందంగా తీర్చిదిద్దడం ఓ కళ. ఇల్లు బాగా కనిపించేందుకు రంగు రంగుల బొమ్మలు, పోస్టర్లు అతికిస్తుంటారు. ఇప్పుడు ట్రెండ్ మారుతోంది. ఇంటీరియల్ డెకరేషన్‌కు ఎంత ఖర్చు అయినా వెనకాడటం లేదు. అరుదైన విగ్రహాలు, ప్రత్యేకమైన ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు అక్వేరియం ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్నారు. ఇంటికొచ్చే వారిని ఆకట్టుకునేందుకు కొందరు, వాస్తు పేరుతో మరి కొందరు అక్వేరియాన్ని తెచ్చేసుకుంటున్నారు. అందులో అందమైన చేపలు పెంచుతూ ఆహ్లాదాన్ని.. ఆనందాన్ని పొందుతున్నారు.



వివిధ రకాల మోలిస్ చేపలు

- ఇళ్లు, వ్యాపార కేంద్రాల్లో అక్వేరియం ఏర్పాటుపై పెరుగుతున్న ఆదరణ
- చిట్టి చేపల పెంపకంతో నెగెటివ్ ఎనర్జీ పోతుందని నమ్మకం
- ట్రెండ్‌కు అనుగుణంగా పెరుగుతున్న విక్రయాలు

హిందూపురం: ప్రస్తుతం చాలా మంది అక్వేరియాలను ఇళ్లతో పాటు కార్పొరేట్ కార్యాలయాల్లోనూ ఏర్పాటు చేసుకుంటున్నారు. అక్వేరియాలు ఇంటికి అందంతో పాటు మానసిక ఆహ్లాదం కల్గిస్తాయని ఎక్కువ మంది నమ్మకం. చిన్న పిల్లలయితే వీటికి మరింగా ఇష్టపడతారు. వాటిని చూసి లోకాన్నే మరిచిపోయి మురిసిపోతారు. నీటిలో అటు ఇటూ తిరిగే చిట్టిచేపలను చూస్తూంటే మానసిక వత్తిడి తగ్గిపోయి ఏకగ్రత పెరుగుతుందని అభిప్రాయం లేకపోలేదు. అంతేగాక అక్వేరియం ఇంటిలో ఉంచుకుంటే వాస్తు దోశాలుపోయి ఇంటిలో శాంతి, శుభం, ధనలాభం వస్తుందని మరికొందరు గట్టిగా నమ్ముతారు. అందుకే చాలా మంది వ్యాపార కేంద్రాలు, లాడ్జీలు ఇలా జనసంచరం అధికం ఉన్న ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

చేపల తొట్టెల్లో చాలా రకాలు

సాధారణంగా అక్వేరియాలను గాజుతో తయారుచేస్తారు. ఇటీవల కాలంలో ప్లాస్టిక్, ఫైబర్‌తో కూడిన ఆకర్షణీయమైన తొట్టెలు కూడా అందుబాటులోకి వచ్చాయి. సుమారు 20 జాతుల చేపలు పట్టేలా చేపల తొట్టెలు మార్కెట్లలో లభ్యమవుతున్నాయి. రూ.1500 నుంచి రూ.20 వేల ధర పలుకుతున్నాయి.

చూడ ముచ్చటైన రంగు చేపలు ఎన్నో...

చూడగానే ఆకట్టుకునే రంగరంగుల చేపలు ఆహ్లాదాన్నిస్తాయి. చేపలలో దాదాపు 20 జాతుల వరకు చేపలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో చేప పిల్ల రూ.10 నుంచి రూ.వందలు రూ.వేల దకా పలుకుతున్నాయి. మరికొన్ని వాస్తుదోష నివారణ అంటూ మరికొన్ని రకాలు ఉన్నాయి. వీటివిలువ రూ.10 వేల నుంచి రూ.50 వేల దాకా ఉంటుందని చేపల తొట్టెల వ్యాపారి సంపత్‌కుమార్ చెబుతున్నారు. వాస్తు చేపలుగా చెప్పుకునే రకాల్లో అరోనా, ఫ్లోరిన్ చేపల విలువ పెద్దగా ఉంటుంది.

జాగ్రత్తలూ ముఖ్యమే

చేప తొట్టెలను తెచ్చి ఇంట్లో పెట్టుకోగానే సరిపోదు. ఎంతో జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. ఇంట్లో సాధరణ ఉష్ణోగ్రత ఉంటే ప్రదేశంలో ఉంచుకోవాలి. నీటితొట్టెలో ఆక్సిజన్ యంత్రాలు కల్గిన పైపులు అమర్చాలి. సాధారణ ఆహారం కాకుండా చేపల కోసం ప్రత్యేకంగా విక్రయించే ఆహార పదార్థాలు అందించాలి. భూగర్భ జాతులను మాత్రమే నీటితొట్టెలో వాడాలి. పదిరోజులకు ఒకసారి తప్పనిసరిగా నీటిని మార్చాలి.



కోయిఫిష్ చేపలు



వాస్తుచేపగా చెప్పుకునే ఫ్లవర్ ఆన్

చాలా మంచిదని మా నమ్మకం



ఇంటిలో అక్వేరియం పెట్టుకుంటే వాటిని చూస్తూ మానసిక ప్రశాంత కలుగుతుంది. ముఖ్యంగా మా పాప వాటిని చూస్తూ ఆడుకుంటూ ఉత్సాహంగా ఉంటోంది. అంతేకాదు వాస్తు చేపలు ఇంటిలో తిరిగితే ఇంటిలోని నెగిటివ్ ఎనార్జీ వెళ్లిపోతుందని అంటారు. అలాగే అక్వేరియం ఇంటికి సరికొత్త అందాన్ని తెచ్చిపెడుతుంది.

– కార్తీక్, హిందూపురం.

అమ్మకాలు బాగున్నాయి



ఇళ్లలో అక్వేరియాలు పెట్టుకునే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో అమ్మకాలు కూడా పెరిగాయి. వివిధ రకాల చేపలను కొంటున్నారు. ముఖ్యంగా అక్వేరియం పెట్టుకుంటే మంచిదన్న నమ్మకం పెరిగింది. వ్యాపార దుకాణాలు, ఇంటిలో పెట్టుకుంటే ఆర్థిక ఇబ్బందులు తీరుతాయని చెబుతారు.

– సంపత్‌కుమార్, హిందూపురం



షార్క్‌ఫిష్‌లు



టైగర్ రకం చేపలు



ఓ ఇంట్లో అక్వేరియం నిర్వహణ ఇలా..

బాధిత కుటుంబానికి పరామర్శ



నాగరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు (45) గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ బుధవారం గ్రామానికి గ్రామానికి చేరుకొని నాగరాజు మృతదేహం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజప్పస్వామి, అమర్, ఎల్లారెడ్డి, సజ్జప్ప తదితరులున్నారు.

గోరంట్ల: మండల పరిధిలోని యర్రగారిపల్లి గ్రామానికి చెందిన కమ్మవారిపల్లి సర్పంచ్ మణి భార్త శివశంకరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ బుధవారం యర్రయ్యగారిపల్లికి చేరుకొని శివశంకరరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పాటూరి శంకరరెడ్డి, సుబ్బారెడ్డి, ముసలిరెడ్డి, రామిరెడ్డి ఉన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



రామనపల్లిలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర(అగళి): పార్టీలకు అతీతంగా సంక్షేమం పథకాలు మంజూరు చేస్తూ ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మరోసారి సీఎంను చేసుకుందామని ఎమ్మెల్యే తిప్పేస్వామి పిలుపునిచ్చారు. అగళి మండలం రామనపల్లిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రజా సమస్యలపై కూడా ఆరా తీశారు. సచివాలయం పరిధిలో పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మండల కన్వీనర్ మహేంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రప్ప, సర్పంచ్ కృష్ణప్ప, ఎంపీటీసీ సతీష్, జేసీఎస్ కన్వీనర్ శివన్న, ఎంపీడీఓ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్లు మింగిన నాగుపాము



రాయి కిందకు వెళుతున్న పాము

మడకశిరరూరల్: మండల పరిధిలోని జమ్మానిపల్లిలో నారాయణరెడ్డి పాత ఇంటి ఆవరణలో పొదగడలో ఉంచిన కోడిగుడ్ల గంపలోకి బుధవారం సాయంత్రం నాగుపాము ప్రవేశించింది. కోడి అరుస్తూ గంపలో నుంచి బయటికి రావడంతో ఇంటి యజమాని వెళ్లి చూడగా అప్పటికే 11 కొడిగుడ్లలో 6 కోడిగుడ్లను పాము మింగివేసింది. ఆఖరికి స్థానికులు పామును చంపేశారు.



గంపలోని కోడి గుడ్లు



పడగెత్తి చూస్తున్న నాగుపాము

రూ.33,925 రికవరీకి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అమరాపురం: మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో 2022 -23 ఆర్థిక సంవత్సరానికి జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.33,925లను రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన 17వ సామాజిక తనిఖీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పీడీ రామంజనేయులు, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ జయసింహ తదితరులు హాజరయ్యారు. ఎస్సార్పీ కాంతయ్య, డీఆర్పీలు గ్రామాల్లో తనిఖీ బృందం సభ్యులు నిర్వహించిన సామాజిక తనిఖీలు, పరిశీలించిన అంశాలను అధికారుల ముందు చదివి వినిపించారు. మొత్తం మండలంలో రూ.5,11,12,731 కోట్ల నిధులను ఖర్చు చేయగా ఇందులో రూ.33,925 అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత అధికారులు ఈ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునిస్వామి, ఏపీఓ హెన్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, ఎంపీటీసీలు, సర్పంచులు, కూలీలు, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



కరియమ్మనహళ్లి పోలింగ్ కేంద్రంలో ఓటేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప



ఓటేసినట్లు చూపుతున్న వీఎస్ రెడ్డి

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం సార్వత్రిక ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. తాలూకా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడంతో అటు ఎన్నికల సిబ్బంది, ఇటు పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఉదయం పోలింగ్ మందకోడిగా సాగినా మధ్యాహ్నం నుంచి పోలింగ్ ఊపందుకుంది. ఎన్నడు లేనివిధంగా ఈసారి గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక సంఖ్యలో ఓటర్లు రావడంతో సుమారు 80 శాతానికి పైగా పోలింగ్ జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. పళవల్లి గ్రామంలో సుమారు 3.5 వేల మంది ఓటర్లకు కేవలం 3 పోలింగ్ కేంద్రాలుండడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉంటే స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప స్వగ్రామం హనుమంతనహళ్లిలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే శతాధిక స్వాతంత్ర్య సమర యోధుడు వీఎస్ రెడ్డి స్వగ్రామం వెంకటాపురంలో తన ఓటు హక్కును వినియోగించుకుని ఆదర్శంగా నిలిచారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేశ్ హనుమంతనహళ్లి, జేడీఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తిమ్మరాయప్ప కేటీహళ్లి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణానాయక్ పళవల్లి తండాలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాలూకా వ్యాప్తంగా 246 పోలింగ్ కేంద్రాల్లో కాంగ్రెస్ – జేడీఎస్ మధ్యే గట్టి పోటీ ఉన్నట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. బీజేపీ, కేఆర్పీపీ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నట్లు చెబుతున్నారు. కొన్ని తండా ప్రాంతాల్లో బీజేపీ, కొన్ని ఎస్సీ కాలనీల్లో కేఆర్పీపీ కొంత మేరకు ఓట్లు రాబట్టుకునే అవకాశం ఉందంటున్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

మడకశిరరూరల్: మండలంలోని గుండుమల గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ సోనీబాయి ఉద్యోగులకు సూచించారు. బుధవారం ఆమె గుండుమల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవల అమలు తీరు, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈఓఆర్డీ శైలజ, కార్యదర్శులు, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

చిలమత్తూరు: మండల కేంద్రంలోని సాయి యేసు విద్యానికేతన్ పాఠశాలలో వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులపై శిక్షణ ఇస్తున్నట్లు కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి వారం ప్రతిభా పరీక్షలు నిర్వహించి నగదు ప్రోత్సాహకాలు కూడా అందజేస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



ఉష్ణోగ్రత సమాచారం (గరిష్టం)

హిందూపురం	36.0
పెనుకొండ	38.0
మడకశిర	36.0

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుడిబండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాధమ్మ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

రొద్దం: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ 12వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

గుడిబండ: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ రామారావు ఉపాధి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వర్షాలు బాగా కురుస్తున్నాయని చెప్పారు. అందువల్ల ఉపాధి కూలీలకు పనులు చేయడానికి సులభంగా ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేసి జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. మండలంలో ప్రతిరోజూ 4000 మందికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ భార్గవి, ఈసీ లక్ష్మానాయక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంతో బుధవారం ఉపాధి పనులపై ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులు ప్రారంభం కాని గ్రామ పంచాయతీల్లో వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. కూలీలకు పనుల కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీష్, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట



రొళ్ల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ సురేష్‌బాబు

రొళ్ల: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సిబ్బంది దృష్టి సారించాలని మడకశిర సీఐ సురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్ణాటక రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మండల సరిహద్దులో కె.బ్యాడిగెర, పిల్లిగుండ్ల సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి చెక్‌పోస్టులను సందర్శించారు. అక్రమ మద్యం, గుట్కా రవాణాపై నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. తర్వాత రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో గొడవలు, ఘర్షణలు, దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాలాజీ, కానిస్టేబుల్ గంగాధర్, హోంగార్డు బసవరాజు పాల్గొన్నారు.